క్లుప్తంగా

వామనుడిగా అప్పన్న



వామనాలంకారంలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వరాహ లక్ష్మీనృసింహస్వామి వామనావతారంలో దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వామనుడిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్ఠింపజేసి.. ఆళ్వారులను మరో పల్లకిలో సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

మర్యాదపూర్వక కలయిక



మేయర్‌ను సన్మానిస్తున్న సంఘ నాయకులు

మల్కాపురం: నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని శుక్రవారం విశాఖ పశ్చిమ నియోజక వర్గ శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.మేయర్ నివాసంలో ఇటీవల కొత్తగా ఏర్పడిన శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులను మేయర్‌కు పరిచయం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బౌద్ధాలయంలో పౌర్ణమి పూజలు



పేద మహిళలకు చీరలు అందిస్తున్న అతిథులు

కంచరపాలెం: స్థానిక అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. బుద్ధుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అతిథుల చేతుల మీదుగా పేద మహిళలకు చీరల పంపిణీ, అన్నదానం చేశారు. అనంతరం ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను రాజుగణేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సిహెచ్.బాబురావు, రాజు, భీమారావు, సూరిబాబు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి రూ. లక్ష విరాళం



ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులకు చెక్కు అందజేస్తున్న దాత మహేష్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన ఆగమ పాఠశాల విద్యార్థుల సంక్షేమం నిమిత్తం నగరంలోని బీహెచ్‌పీవీ దరి అక్కిరెడ్డిపాలేనికి చెందిన ఆకుల మహేష్ అనే దాత రూ.లక్ష ఇచ్చారు. సింహగిరిపై సంబంధిత విరాళాన్ని చెక్కురూపంలో ఆలయ ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులకు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో నాయుడు, దేవస్థానం ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

పండగ వేళ.. తస్మాత్ జాగ్రత్త

- సొంతూళ్లకు వెళ్లే వారు సమాచారమివ్వండి
- తాళం వేసి ఉన్న ఇళ్లపై ప్రత్యేక నిఘా
- షాపింగ్ సమయంలో అప్రమత్తం
- దుకాణాల వద్ద పోలీస్ పహారా
- గోపాలపట్నం క్రైం ఎస్‌ఐ నర్సింగరాజు



క్రైం ఎస్‌ఐ నర్సింగరాజు



గోపాలపట్నం: సంక్రాంతి పండగ వేళ.. సొంత గ్రామాలకు వెళ్లే ప్రజలు జాగ్రత్తలు వహించాలని గోపాలపట్నం క్రైం ఎస్‌ఐ నర్సింగరాజు అన్నారు. శుక్రవారం 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు పలు సూచనలిచ్చారు. చాలా మంది పండగ జరుపుకునేందుకు సొంతూళ్లకు వెళ్లడం సహజమని, అలా వెళ్లే వారు పోలీస్ స్టేషన్‌కు సమాచారమివ్వాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో, తాళం వేసి ఉన్న ఇళ్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్ ద్వారా ఇంటికి ప్రత్యేక భద్రత కల్పిస్తామని చెప్పారు. ఇంట్లో విలువైన వస్తువులు ఉంచకుండా బ్యాంక్‌ల్లో పెట్టుకుంటే భద్రత ఎక్కువగా ఉంటుందన్నారు.

షాపింగ్‌కు వెళ్తే..

పండగ నేపథ్యంలో షాపింగ్‌కు వెళ్లే వారు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ హెచ్చరించారు. దుకాణాల్లోకి వెళ్లే సమయాల్లో, దుస్తులు ఎంచుకునే సమయాల్లో హ్యాండ్ బ్యాగులు కట్‌చేసి నగదు, విలువైన వస్తువులు చోరీకి గురయ్యే ప్రమాదముందని చెప్పారు. బ్యాగులు, మొబైల్ ఫోన్లను భద్రంగా ఉంచుకోవాలన్నారు.

దుకాణాల వద్ద నిఘా

రద్దీగా ఉండే దుకాణాల వద్ద మఫ్టీలో క్రైం పోలీసుల నిఘా ఏర్పాటు చేశామని ఎస్‌ఐ నర్సింగరాజు తెలిపారు. ఉదయం వేళ అంత ఎక్కువగా రద్దీ ఉండటం లేదని.. సాయంత్రం సమయాల్లో ఈ నిఘా ఏర్పాటు చేశామన్నారు. పండగ సమీపిస్తున్నందున ఈ రద్దీ పెరుగుతోందని చెప్పారు. ఆ సమయాల్లో ఉదయం కూడా పోలీసుల నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. దుకాణదారులు కూడా దొంగల బెడద నుంచి వినియోగదారులను కాపాడేందుకు సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాలు పని చేసేలా చూసుకోవాలన్నారు. ఇళ్లల్లో దొంగతనాలు, సైబర్ నేరాలపై స్టేషన్ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

డ్రైడేతో దోమల నిర్మూలన



62వ వార్డులో లార్వాలను పరిశీలిస్తున్న సిబ్బంది



40వ వార్డు ఏకేసీ కాలనీలో దోమ లార్వాలను పరిశీలిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింధియా: సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వ అధికారులు, జీవీఎంసీ సిబ్బంది శ్రమిస్తుంటే కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సీజనల్ వ్యాధుల విజృంభణకు కారణమవుతున్నారని 40, 62వ వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణ రావు అన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మూడు రోజులకు మించి నీటి నిల్వలు ఉంచవద్దని సూచిస్తున్నా పట్టించుకోకుండా దోమలార్వాల ఉత్పత్తికి కారణమవుతున్నారన్నారు. ప్రభుత్వం తీసుకునే చర్యలకు ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించి, విశాఖ నగరాన్ని సీజనల్ వ్యాధులరహిత నగరంగా తీర్చిదిద్దడానికి సహకరించాలని కోరారు. శుక్రవారం జీవీఎంసీ 62వ వార్డు పరిధిలో త్రినాథపురంలో, 40వ వార్డు పరిధిలోని ఏకేసీకాలనీలోనూ జోన్-5 మలేరియా ఇన్‌స్పెక్టర్ నల్ల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే-ఫ్రైడే యాక్టివిటీస్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు వ్యర్థాలను తడి-పొడి చెత్తగా ఇంటి వద్దే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చునని, ప్రజలందరు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంచకుండా, ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఇంటి పరిసరాలలో పాతటైర్లు, వాడిపడేసిన కొబ్బరిబొండాలు, బిరడా లేని సీసాలు ఉంచరాదన్నారు. చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ రోమాల వేణుబాబు, మలేరియా సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, మలేరియా సిబ్బంది రాంబాబు, పాడుగు మేఘన, వార్డు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంప్రదాయాలంటే ఇష్టం

- బాలభాను పాఠశాల సందర్శనలో విదేశీయులు



బాలభాను పాఠశాలలో విదేశీయుల సందడి

మురళీనగర్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలంటే తమకెంతో ఇష్టమని విదేశీయులు అన్నారు. గురుపూజోత్సవాల సందర్భంగా శుక్రవారం మురళీనగర్ బాలభాను పాఠశాలలో ఈస్ట్ వెస్ట్ బ్రదర్‌హుడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జర్మనీ, ఆస్ట్రేలియా, స్పెయిన్, జర్మనీ, అర్జెంటీనా దేశాలకు చెందిన 40 మంది విశాఖ పర్యటనలో భాగంగా ఈ స్కూల్‌ను సందర్శించారు. ఇక్కడ అమలు చేస్తున్న విద్యా బోధనా విధానం, విద్యార్థుల క్రమశిక్షణ, వారు అనుసరిస్తున్న సంప్రదాయ పద్ధతులు, ఆచార వ్యవహారాలను వీరు దగ్గరుండి పరిశీలించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఆచరణీయమైనవన్నారు. విదేశీ వనితలు తెలుగు సంప్రదాయ దుస్తులు, చీరలు ధరించి సందడి చేశారు. ఆస్ట్రేలియా నుంచి రోసీ డియాజ్ డ్యాక్ గ్రూప్, జర్మనీ నుంచి రాబర్ట్ బడియా గ్రూప్, స్పెయిన్ నుంచి లూడ్జర్ ఫిలిప్స్ గ్రూప్ సభ్యులు, అర్జెంటీనా కంట్రీ గ్రూప్ నుంచి ఆల్‌బెర్ట్ బెలిజి, క్రిస్టియానా యూఎస్‌ఏ గ్రూప్ నుంచి మిక్వాల్, రోజా సగ్రోసా తదితరులు పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో జగద్గురు పీఠం కార్యదర్శి, బాలభాను విద్యాలయం కరస్పాండెంట్ రామకృష్ణరాజు, ప్రిన్సిపాల్ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు సిహెచ్.రమణరావు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి సాదర స్వాగతం



విమానాశ్రయంలో కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్‌తో బీజేపీ నాయకులు

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో కేంద్ర విదేశాంగ, పార్లమెంట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి మురళీధరన్‌కు సాదర స్వాగతం లభించింది. ఆయనకు రాజ్య సభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, బాల రాజేశ్వరరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

రహదారికి మరమ్మతులు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌లో నిరంతర తాగునీటి సరఫరా పైప్‌లైన్ పనుల్లో భాగంగా తవ్వి వదిలేసిన రహదారికి మరమ్మతులు చేపట్టారు. రోడ్డు గోతుల్లో సిమెంట్‌తో పూడ్చే పనులు నిర్వహించారు. వీటిని శుక్రవారం కార్పొరేటర్ బొమ్మడి రమణ పరిశీలించారు. స్థానిక నాయకులు నరవ పైడిరాజు, పిల్లల మాణిక్యం, శ్రీను పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వయోలిన్ కచేరీ



కచేరీ చేస్తున్న మూర్తి

సీతంపేట: కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో శుక్రవారం శంకరమఠంలో మహాత్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామికి చండీ హోమం నిర్వహించారు. మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు స్వామిజీని కలిసి ఆశీస్సులు అందుకున్నారు.

రోడ్డు ప్రమాదాలపై మహిళలకు అవగాహన



గుర్రంపాలెంలో మహిళలకు అవగాహ కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్

సింహాచలం: రోడ్డుపై ప్రయాణం సాగించేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మీ కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు చెప్పాలని మహిళలకు వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ సూచించారు. పెందుర్తి మండలం గుర్రంపాలెంలో శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ రహదారి నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం సాగించవచ్చన్నారు. చిన్నపొరపాటు ఎంతో అనర్థాన్ని తెచ్చిపెడుతుందని.. ఇంట్లో చీకటి నింపుతుందని తెలియజేశారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ కచ్చితంగా ధరించేలా చూడాలని సూచించారు. అలాగే కార్లులో ప్రయాణించే వారు సీట్ బెల్టు ధరించాలని.. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవ్ చేయడం, సిగ్నల్ క్రాసింగ్, ఓవర్‌స్పీడ్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



కొత్త వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న దాడి సత్యనారాయణ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని పల్లివీధి, ఇందిరాకాలనీ,ఇండస్ట్రియల్‌కాలనీ సచివాలయాల్లో నూతనంగా చేరిన వలంటీర్లకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి సత్యనారాయణ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా చేరిన వార్డు వలంటీర్లు తమ పరిధిలోని ప్రజా సమస్యలపై తక్షణం స్పందించాలని,అలాగే ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగహన కల్పించాలని కోరారు.కార్యక్రమాల్లో ఆయా ప్రాంతాల సచివాలయాల సిబ్బంది,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతో సొంతింటి కల సాకారం



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న రామ్మోహనరెడ్డి

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ సచివాలయం పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ పేదలందరికీ సొంత ఇళ్లు ఉండాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి తావులేకుండా ఇళ్ల పట్టాలు అందజేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ఆర్నెల్లలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం తరఫున ర.1.80 లక్షలు లబ్ధిదారులకు ఇవ్వడం జరుగుతుందని, అలా కట్టుకోలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వమే ఇల్లు కట్టి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం



మహిళలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రకాష్‌నగర్‌లో ధాన్ ఫౌండేషన్, మల్కాపురం కళంజియా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. నగరంలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి యాజమాన్యం సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వైద్యులు క్యాన్సర్ వ్యాధి ఎలా వస్తుంది, శరీరంలో కలిగే మార్పులు, లక్షణాలు తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బేంటీన, క్యాంప్ కో ఆర్డినేటర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మల్కాపురం: మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రధాన కూడళ్లలో శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ వద్ద ట్రాఫిక్ సీఐ తులసీదాస్, ఎస్‌ఐ సుదర్శన్‌రావు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలను నిలిపి వాటి పత్రాలను పరిశీలించారు. వాహనాల నంబర్ ప్లేట్లు నిబంధనల ప్రకారం ఉన్నాయా లేదా అన్నది పరిశీలించి, నిబంధనలను పాటించని వారి ప్లేట్లు తొలగించి, జరిమానా విధించారు. ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని వాహన చోదకులకు సీఐ సూచించారు.

హోరాహోరీగా పోటీలు



డిస్కస్‌త్రో చేస్తున్న కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థిని



డిస్కస్‌త్రో చేస్తున్న కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థిని

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్న ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం వెలువడిన ఫలితాల ప్రకారం బాల్‌బ్యాడ్మింటన్ విజేతగా సాయిగణపతి పాలిటెక్నిక్ కాలేజీ, షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఏవీఎన్ పాలిటెక్నిక్ కాలేజీ, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఏవీన్ కాలేజీ, టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో సాయిగణపతి పాలిటెక్నిక్ కాలేజీ, చెస్ పోటీల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గ్రైస్), 100 మీటర్స్ అథ్లెటిక్స్‌లో ఏవీఎన్ కాలేజీ, 400 మీటర్ల పరుగు పందెంలో ఏవీన్ కాలేజీ, 800 మీటర్ల ఈవెంట్‌లో పాడేరు జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, 1500 మీటర్ల ట్రాక్‌లో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, బ్రాడ్ జంప్‌లో ఏవీఎన్ పాలిటెక్నిక్ కాలేజీ, షాట్‌పుట్‌లో విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు విజేతలుగా నిలిచాయి.

విద్యార్థినుల సత్తా

బాలికల పోటీలకు సంబంధించి 100 మీటర్ల పరుగు పందెం, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో భీమునిపట్నం ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కాలేజీ, షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ పోటీల్లో కశింకోటలోని రాజీవ్‌గాంధీ ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కాలేజీ, టేబుల్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్‌లో సాయిగణపతి కాలేజీ, చెస్, 800 మీటర్ల పరుగు, డిస్కస్‌త్రోలో విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, షాట్‌పుట్‌లో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, బ్రాడ్ జంప్‌లో సాయిగణపతి కాలేజీల బాలికలు విజేతలుగా నిలిచారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



పెందుర్తి వెంకటాద్రికి పోటెత్తిన భక్తులు



సింహగిరిపై గోదాదేవికి హారతి ఇస్తున్న అర్చకుడు శ్రీకాంతాచార్యులు

సింహాచలం: ధనుర్మాసం పూజలు శుక్రవారం సింహగిరితో పాటు పలు ఆలయాల్లో విశేషంగా నిర్వహించారు. సింహగిరిపై తెల్లవారుజామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం, సాత్తుమొరై అనంతరం గోదాదేవి తిరువీధి నిర్వహించారు. విశేష ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకుడు శ్రీకాంతాచార్యులు పూజలు చేశారు.

వెంకటాద్రిపై..

పెందుర్తి వెంకటాద్రికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఉదయం తిరుప్పావై సేవాకాలం విశేషంగా నిర్వహించారు. గోదాదేవికి విశేష పూజలు.. వెంకన్నకు పలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ పూజలను నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో..

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవికి విశేష అలంకరణ చేసి వేదికపై వేంచేయజేశారు. తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నప పారాయణ నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవ్ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


బ్యాంకు మహిళా ఉద్యోగుల సదస్సు రేపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంకు ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

సీతంపేట: ఆంధ్ర, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 8న హైదరాబాద్ కాచిగూడలో 6వ బ్యాంకు మహిళా ఉద్యోగుల సదస్సు జరగనుందని సంఘ నాయకుడు ఆర్.వి.రవికుమార్ తెలిపారు. శాంతిపురంలోని కెనరా బ్యాంకులో శుక్రవారం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు రెండు రాష్ట్రాల నుంచి వెయ్యి మంది మహిళా ఉద్యోగులు పాల్గొంటారని తెలిపారు. వారి సమస్యలు, హక్కులు, బ్యాంకింగ్ రంగంలో రాబోయే మార్పులు, ఎదుర్కోడానికి చేపట్టే చర్యలపై చర్చిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సమన్వయ సంఘ నాయకులు ఎ.యుగంధర్, ఎం.ఎస్.కుమార్, వి.రమేష్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

9న నివాస హక్కుల పోరాటంపై సదస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మి తదితరులు

సీతమ్మధార: ఈనెల 9న నివాస హక్కుల పోరాట దినంపై డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సును నిర్వహిస్తున్నట్లు మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ ఈ సదస్సులో కేంద్ర ఇంధన శాఖ పూర్వ కార్యదర్శి ఈఏఎస్ శర్మ ప్రారంభోపన్యాసం చేయనున్నారని తెలిపారు. రైతాంగ ఉద్యమంలో కీలక బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఆశిష్‌మిట్టల్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారని అన్నారు. యూసీడీ డిపార్ట్‌మెంట్ కేటాయించిన 40 శాతం నిధులను మురికివాడల అభివృద్ధి, ఉపాధికి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కన్వీనర్ ఈసర లక్ష్మి, కో-కన్వీనర్ పరదేశి, అప్పారావు, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటలక్ష్మి, బాలనాగమ్మ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నిర్మల, దళిత విముక్తి కన్వీనర్ ఎస్‌పీ రమణ తదితరులు పాల్గొన్నారు.